


నాణ్యమైన ఎరువులు విక్రయించాలి

కులకచర్ల, జూలై 27: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ అన్నారు. కులకచర్లలోని శ్రీలక్ష్మీ నర్సింహ ఫర్టిలైజర్స్ షాపును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.దుకాణాదారులు ఎరువులు, విత్తనాలు విక్రయించే సమయంలో కొనుగోలు చేసే రైతుల ఆధార్ నెంబర్ తీసుకోవాలన్నారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు.

వీకెండ్ సందడి



కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో అనంతగిరుల అందాలు కనువిందు చేస్తున్నాయి. వీకెండ్ కావడంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలిస్తున్నారు. కమ్ముకున్న పొగమంచు, కొండల్లో నుంచి వస్తున్న జలధారలను చూస్తూ ప్రకృతి ప్రేమికులు మంత్ర ముగ్ధులవుతున్నారు. పక్షుల కిలకిల రాగాలు వింటూ మైమరచి పోతున్నారు. సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. - వికారాబాద్, జూలై 27



రామ్మోహన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే

సబితా ఇంద్రారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే

జిల్లాపై రగడ

వికారాబాద్ జిల్లా ఏర్పాటుపై వాగ్వాదం.. అసెంబ్లీలో హాట్ హాట్

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కేంద్ర బింధువుగా నిలిచింది. జిల్లా గురించి చర్చ హాట్‌హాట్‌గా సాగింది. ప్రధానంగా వికారాబాద్ జిల్లా ఏర్పాటు గురించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మధ్య ఆసక్తికర చర్చ సాగింది. తమ ప్రాంతాన్ని మారుమూలకు నెట్టేసి వికారాబాద్ జిల్లాగా ఏర్పాటు చేశారని రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించగా.. వెనుకబడిన వికారాబాద్ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని 30 ఏళ్లుగా ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారని, ఇపుడు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వికారాబాద్ జిల్లా ఏర్పాటును తప్పుబట్టడం సరికాదని సబితారెడ్డి పేర్కొన్నారు. దీంతో సభలో వాడీవేడి చర్చకు దారితీసింది.

- రంగారెడ్డి జిల్లాను ఎడారిగా మార్చారు : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- శాస్త్రీయంగా జరగలేదన్న ఎమ్మెల్యే టీఆర్ఆర్
- మారుమూలకు నెట్టేశారని ఆవేదన
- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఇరకాటంలోకి నెట్టిన సబితారెడ్డి
- వికారాబాద్ జిల్లాపై మీ అభిప్రాయమేమిటని ప్రశ్నించిన ఎమ్మెల్యే

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

అసెంబ్లీ సమావేశాల్లో వికారాబాద్ జిల్లా ఏర్పాటుతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు అంశాలపై శనివారం నేతల మధ్య హాట్‌హాట్‌గా చర్చ జరిగింది. అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా విషయాలను ప్రస్తావించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా భూములను అమ్మేసిందని, కానీ జిల్లాకు సాగునీరు ఇవ్వకుండా ఎడారి ప్రాంతంగా మార్చారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్షల కోట్ల విలువైన రీజినల్ రింగు రోడ్డును రూ.7వేల కోట్లకు అమ్ముకున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పదేళ్లైనా పూర్తి చేయలేదని విమర్శించారు. సభలో ప్రసంగించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆవేశానికి లోనై తొడకొట్టారు. చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేశారని దీనివల్ల ఉమ్మడి జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఏర్పాటుపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. గతంలో తమ ప్రాంతం హైదరాబాద్‌లో కలిసి ఉండేదని.. తరువాత గ్రామీణ ప్రాంతాలను కలిపి రంగారెడ్డి జిల్లాగా ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదన్నారు. తమ ప్రాంతాన్ని మారుమూలకు నెట్టేసి వికారాబాద్ జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. తాజాగా విడుదలైన తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉండగా వికారాబాద్ జిల్లా అట్టడుగున ఉందన్నారు. ఈ తారతమ్యాలు తగ్గించాల్సిన అవసరం ఉందని, పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక జిల్లా ఏర్పాటు చేయాలని, 50వేల మంది జనాభాకు ఒక మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంపై మాజీ మంత్రి సబితారెడ్డి జోక్యం చేసుకోవడంతో చర్చ రసవత్తరంగా మారింది. వెనుకబడిన వికారాబాద్ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని 30ఏళ్లుగా ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారని ఇపుడు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వికారాబాద్ జిల్లా ఏర్పాటును తప్పుబట్టడం సరికాదని సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటనీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సబితారెడ్డి అడిగి ఇరకాటంలో పెట్టారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు లేచి స్పీకర్ అందరి వాడని ఆయన అభిప్రాయాన్ని ఎలా కోరతారని సబితారెడ్డిని ప్రశ్నించారు. స్పీకర్ కూడా వికారాబాద్ ప్రాంతానికి చెందిన వారు కావడంతో ఆయన అభిప్రాయం కోరానని, అంతే తప్పా వేరే కాదని చెప్పి ప్రసంగం ముగించారు.

ఒవైసీని ఓడించడం

మోదీ, షాలతోనే కాలేదు

- మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ
- తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీకి సహకరిస్తాం
- కొడంగల్‌లో మైనారిటీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా
- యువత రాజకీయాల్లోకి రావాలి
- రాబోయే ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలి
- హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

కొడంగల్, జూలై 27: గత ఎంపీ ఎన్నికల్లో ఎంఐఎంను ఓడించేందుకు ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా ప్రయత్నించినా సాధ్యపడలేదు. పార్టీని ఓడించడమే లక్ష్యంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఢిల్లీ నుంచి దారుసలాం వరకు మోదీ, షాలు పర్యటించినా తనను ఓడించలేదని హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని గుర్మిట్‌కల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని రెడ్డిబసిరెడ్డి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ అల్లర్లకు ఉసిగొల్పడం సరైంది కాదన్నారు. బీజేపీపాలిత రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, బీహార్ తదితర ప్రాంతాల్లో మతవిద్వేషాలను రెచ్చగొడుతూ ముస్లింలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అన్నీ ప్రాంతాల్లో ఎంఐఎం బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. హైదరాబాద్‌లో ఇతరత్రా పనులకు దారుసలాంకు అన్ని మతాల వారు వస్తుంటారని గుర్తు చేశారు. ఎంఐఎం పార్టీ కులమతాలకతీతంగా పని చేస్తోందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలపై దాడులు పెరిగాయన్నారు. ప్రధానంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ అక్కడి ముస్లింలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తామని స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో మైనారిటీల సమస్యలను పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే.గుల్షన్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దానిపై స్పందించిన ఒవైసీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియోద్దీన్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి వచ్చి రాణిస్తేనే మైనారిటీల అభ్యున్నతి సాధ్యపడుతుందన్నారు. పార్టీ బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని సూచించారు. సమావేశంలో దూద్ బౌలి కార్పొరేటర్ ఎండీ.సలీం, అబ్దుల్ మన్నాన్ రహెబర్, హఫీజ్ అబ్దుల్ రషీద్, కరీం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను డెలివరీ చేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న లింగ్యానాయక్

వికారాబాద్, జూలై 27: లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో సీఎంఆర్ డెలివరీలో ఆలస్యంపై రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మిల్లు పట్టిన బియ్యాన్ని (సీఎంఆర్)ఎఫ్‌సీఐకి నిర్ణీత సమయంలో చేరవేయడంలోనిర్లక్ష్యం వహించకూడదన్నారు. 2021- 22 వానాకాలం సీజన్ సంబంధించి సీఎంఆర్‌ను ఆగస్టు15లోపు అందించాలని తెలిపారు. అదే విధంగా 2022-23వానాకాలం సీజన్‌కు సంబంధించి సెప్టెంబర్ మొదటి వారంలోగా సీఎంఆర్‌ను ఇచ్చేలా మిల్లర్లు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మిల్లింగ్ అయ్యేలా డిప్యూటీ తహసీల్దార్లు తమ కార్యాచరణను రూపొందించుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణ బాయ్, రైస్ మిల్లర్లఅసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఝాన్సీ

స్త్రీలను అణచివేస్తున్న పితృస్వామిక ఆధిపత్యం

ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

వికారాబాద్, జూలై 27: స్త్రీలను పితృస్వామిక ఆధిపత్యం అణచివేస్తూనే ఉందని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో క్లబ్‌హాల్‌లో పీవోడబ్ల్యూ ద్వితీయ మహాసభను జిల్లా కార్యదర్శి గీతా, ప్రభావతి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. మత, ఆచార సాంప్రదాయాలు, కట్టుబాట్ల పేరుతో స్త్రీల ఆత్మగౌరవం దెబ్బతీయబడుతూనే ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా మహిళా సంఘాలు నిరంతరం గొంతుఎత్తుతూనే ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లో సమాన అవకాశాలు, హక్కుల కోసం పోరాటం సాగిస్తూనే ఉన్నారన్నారు. పురుషులతో పాటు ప్రతి రంగంలో పోటీ పడుతూ దేశాభివృద్ధికి కృషి చేస్తున్నా, మహిళలపై ఇంటా, బయట ఇంకా హింస కొనసాగుతూనే ఉందన్నారు. సమర్థవంతంగా పని చేసినా ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలు పదోన్నతులు, సమాన వేతనాలు పొందలేక అణచివేతకు, వివక్షకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అర్చీలా, పద్మమ్మ, లక్ష్మీ, సమీనా, ఆశ్రిన్, ఉమా, ఆశ, అంజమ్మ, లక్ష్మీ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



స్థానిక పోరుకు సన్నాహాలు!

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు షురూ

- ఆగస్టు మొదటి వారంలోగా కొత్త ఓటరు జాబితా
- బీసీ కమిషన్ రిపోర్టు ఆధారంగా నిర్వహణ
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు ?
- మూడు విడతల్లో పోలింగ్!
- గ్రామాల్లో నెలకొన్న సందడి

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్/రంగారెడ్డి అర్బన్, జూలై 27 : త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు నగారా మోగనుంది. సెప్టెంబరు లేదా అక్టోబర్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2తో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆగస్టు ఒకటి నాటికి ఆరు నెలలు పూర్తవుతుంది. ఆరు నెలలు దాటితే కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు రావాల్సిన గ్రాంట్స్ ఆగిపోనుండటంతో ప్రస్తుతం ప్రభుత్వం ఆగమేఘాల మీద పంచాయతీ పోరుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే వచ్చే నెల మొదటి వారంలోగా కొత్త ఓటరు జాబితాను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్ల ప్రకారమే కొనసాగించాలని సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

స్థానిక సమరంపై దృష్టి..

ఇప్పటికే శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. ఇక స్థానిక సమరంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. అదేవిధంగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం జూలై 3,4 తేదీలతో ముసిగింది. ఫిబ్రవరి నెలలోనే పంచాయతీలకు కొత్త పాలకవర్గాలు కొలువు దీరాల్సి ఉండగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేశారు. జూలై మొదటి వారంలో జిల్లా, మండల పరిషత్తుల్లో కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని భావించినా సాధ్యపడలేదు.

బీసీ కమిషన్ రిపోర్టు ఆధారంగా...

పంచాయతీ రిజర్వేషన్లు మారతాయా.. లేక పాత వాటి ప్రకారమే కొనసాగిస్తారా..అనే సందిగ్ధత నెలకొంది. వాస్తవానికి పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లనే యథాతథంగా కొనసాగించాలి. కానీ.. కొత్త ప్రభుత్వం చట్ట సవరణ చేస్తే రిజర్వేషన్లు మారవచ్చు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే కార్యదర్శులు వార్డు సభ్యులకు సంబంధించిన రిజర్వేషన్లపై వివరాలు పంపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది. మరోపక్క. బీసీ గణన తెరపైకి రావడంతో రిజర్వేషన్లు మారతాయనే ప్రచారం జరుగుతోంది. బీసీ కమిషన్ రిపోర్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని సర్కారు నిర్ణయించింది.

మూడు విడతల్లో ఎన్నికలు?

రంగారెడ్డి జిల్లాలో 27మండలాలు, 558 గ్రామ పంచాయతీలున్నాయి. 2019లో మూడు విడతల్లో గత పంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. మొత్తం 505 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో 53 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వికారాబాద్ జిల్లాలో 566 గ్రామపంచాయతీలు, 4,862 వార్డులు ఉన్నాయి. గత ఎన్నికల్లో జిల్లాలోని పంచాయతీల్లో మెజార్టీ స్థానాలు మహిళలకే రిజర్వు అయ్యాయి. స్థానిక సంస్థల్లో మహిళలకు 50శాతం రిజర్వు చేయడంతో 566 పంచాయతీల్లో సగం మహిళలకు రిజర్వు చేశారు. మేడ్చల్ జిల్లాలో 61 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

ప్రత్యేకాధికారుల పాలనలో పడకేసిన పారిశుధ్యం

జనవరి 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి పంచాయతీల పాలనను ప్రభుత్వం ప్రత్యేకాధికారులకు అప్పగించింది. ప్రత్యేకాధికారులు వారివారి పనుల్లో బిజీగా ఉండడంతో పల్లెల్లో పాలన గాడి తప్పింది. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ లోపించడంతో వర్షాకాలంలో గ్రామాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతీ చిన్న పనికి కూడా ప్రత్యేకాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి వస్తుండటం.. వారు అందుబాటులో లేకపోవడంతో కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు చేతులెత్తేస్తున్నారు.

నిధుల లేమితో కుంటుపడుతున్న అభివృద్ధి

ఇదిలా ఉంటే పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగితేనే నిధులు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏడాది కాలంగా నిధులు విడుదల చేయలేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. చేపట్టిన పనులకు బిల్లులు రావడం లేదు. ఇప్పటికే గత పాలకవర్గాలకు భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉంది.

సర్పంచ్ పదవులకు పెరుగుతున్న పోటీ



గ్రామాల్లో తాజా మాజీ సర్పంచ్‌లతో పాటు గత ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు సర్పంచ్ పదవిని దక్కించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంపన్నులు సర్పంచ్ కావాలన్న పట్టుదలతో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీలో ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తమకు సర్పంచ్‌గా పోటీచేసే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే చుట్టూ, ప్రదక్షిణలు చేస్తుండగా, ఇతర పార్టీలకు చెందిన నాయకులు అధిష్ఠానాన్ని కలిసేందుకు యత్నాలు సాగిస్తున్నారు.

బ్రిడ్జిపై తేలిన ఇనుప చువ్వలు

- ప్రమాదకరంగా మారిన వైనం
- మరమ్మతులు చేయాలని కోరుతున్న వాహనదారులు



బుద్ధారం బ్రిడ్జిపైన గుంత ఏర్పడి తేలిన ఇనుప చువ్వలు

పెద్దేముల్, జూలై 27: బుద్ధారం వాగుపై నిర్మించిన వంతెనపై సిమెంట్‌బెడ్డు తొలగిపోయి ఇనుపచువ్వలు పైకి తేలాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇనుపచువ్వలు ప్రమాదకరంగా ఉన్నాయ ని వాపోతున్నారు. పెద్దేముల్ మండలం బుద్ధారం సమీపంలోని వాగుపైన రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు కొత్తగా బ్రిడ్జి నిర్మించారు. అయితే బ్రిడ్జినిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలేశాడు. పాతవంతెన చిన్న పాటి వర్షం పడితే చాలు వరదనీరు వంతెన పై నుంచి పారుతోంది. దీంతో వాహనాలు గంటల తరబడి అక్కడే వేచిఉండాల్సి వస్తోంది. జనం పాలకులకు మొరపెట్టుకోవడంతో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా వాహనాల రాకపోకలు జరిగేలా రోడ్డువేసి వదిలేశారు. అయితే వంతెనపైన ఫైనల్‌లేయర్ వేయలేదు. వాహనాల రాకపోకలు ప్రారంభం కావడంతో బ్రిడ్జిపైన సిమెంట్ తొలగిపోయి ఇనుప చువ్వలు పైకి తేలాయి. ఏమాత్రం అక్కడ ఏమరుపాటును ప్రదర్శించినా తేలిన ఇనుపచువ్వలు టైర్లకు తగిలి టైర్లు పగిలిపోయే ప్రమాదముంది. ప్రాణాపాయం జరగకముందే అధికారులు స్పందించి బ్రిడ్జిపై మరమ్మతులు చేసి దానిపైన సిమెంట్ బెడ్డువేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఢిల్లీలో ధర్నాకు తరలిరండి : ఎమ్మార్పీఎస్

షాద్‌నగర్ అర్బన్, జూలై 27: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6,7వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించతలపెట్టిన ధర్నా.. చలో ఢిల్లీ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తరలిరావాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిర్సనోళ్ళ బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణను చేపట్టే వరకు ఉద్యమాన్ని కొనసాగించడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపిక


శర్బజిత్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న టీచర్లు

చేవెళ్ల, జూలై 27 : మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి శర్బజిత్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యాడు. ఈ మేరకు శనివారం ప్రిన్సిపాల్ టేనావతి మాట్లాడుతూ ఈ నెల 30న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ నాలెడ్జ్ పోటీలకు శర్బజిత్ ఎంపికయ్యారని చెప్పారు. ఆ పోటీల్లో విజయం సాధిస్తే.. ఆగస్టు 16న జపాన్‌లో జరిగే ఇన్‌స్పైర్ పోటీల్లో శర్బజిత్ పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.


కాలువ గండిని పూడుస్తున్న హిటాచీ యంత్రం

పిరంగి కాలువకు మరమ్మతులు

శంకర్‌పల్లి, జూలై 27: మండల పరిధిలోని మోకిల గ్రామంలో వరదలతో గండి పడిన పిరంగి కాలువకు నీటి పారుదల శాఖ అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. హిటాచీతో గండి పడిన ప్రాంతంలో మట్టితో పూడ్చివేయించారు. ఐదు రోజుల క్రితం వర్షాల కారణంగా వరదలు వచ్చి పిరంగి కాలువకు గండి పడటంతో పంటలన్నీ పాడైన విషయం తెలిసిందే. నీటిపారుదల శాఖ అధికారులు ఆలస్యంగానైనా స్పందించారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కోసం కాకుండా రైతుల కోసం అధికారులు పనిచేస్తే బాగుంటుందని హితవు పలికారు.



ప్రభుత్వ నెంబర్-2 పాఠశాలలో టీచర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఉమాహారతి

నాణ్యమైన భోజనం అందించాలి

● అదనపు కలెక్టర్ ఉమాహారతి

తాండూరు రూరల్, జూలై 27 : విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందేలా చూడాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని అదనపు కలెక్టర్ ఉమాహారతి సూచించారు. శనివారం పాఠశాలల రాష్ట్ర పరిశీలన బృందంతో కలిసి తాండూరు, పాత తాండూరులోని ప్రభుత్వ నెంబర్-2 పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పఠనా సామర్థ్యాలు రాబట్టారు. టీచర్లువిద్యను ఎలా అందిస్తున్నారో తెలుసుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేలా విద్యనందించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి చదువుపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. పాఠశాలకు సొంత స్థలంలో భవనం ఏర్పాటు చేసే విధంగా చూడాలని తెలిపారు. పరిశీలన బృందం ప్రతినిధులు, విద్యాధికారి వెంకటయ్యగౌడ్, హెచ్ఎం ప్రతిభాభారతి తదితరులున్నారు.

సీఎంపై ఆశలు

● నేడు కల్వకుర్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
● కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ
● బీఎస్ఎన్ఎల్ మైదానంలో బహిరంగ సభ
● డీ-82 కాల్వ పూర్తి, భూ నష్ట పరిహారం మంజూరు కోసం బాధితుల ఎదురుచూపు
● వంద పడకల ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్ ఇవ్వాలని విన్నపం

ఆమనగల్లు/కల్వకుర్తి, జూలై 27: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత గడ్డ కల్వకుర్తికి నేడు(ఆదివారం) రానున్న సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు పలు ఆశలు పెట్టుకున్నారు. కేఎల్ఐ డీ-82 కాల్వతో పాటు సబ్ కెనాల్స్ పూర్తి, పెండింగ్ భూ నష్ట పరిహారం మంజూరుతో పాటు వంద పడకల ఆస్పత్రి మంజూరు చేస్తారని ఆశిస్తున్నారు.

దాదాపు పూర్తయిన కేఎల్ఐ డీ-82 కాల్వ

కల్వకుర్తి ప్రాంతానికి పూర్తి స్థాయిలో సాగు నీరు అందించడానికి కేఎల్ఐని రూపొందించారు. కేఎల్ఐ 29వ ప్యాకేజీలో భాగంగా కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు 160 కిలో మీటర్లు ప్రధాన కాల్వ పూర్తయ్యింది. ఈ కాల్వ మాడ్గుల మండలం నాగిళ్ల వరకు తవ్వాల్సి ఉండగా అక్కడే పనులు ఆగిపోయాయి. అక్కడి నుంచి కాల్వను కొనసాగించేందుకు డీ-82 పేరుతో రూ.179 కోట్లు మంజూరు చేశారు. 59.05 కిలో మీటర్ల ఈ కాల్వను తవ్వాలి. వెల్దండ మండలం చెరుకూరు వద్ద గతంలో టేకు తోట వల్ల ఈ కాల్వ పనులు ఆగిపోగా, ఆ తోటకు పరిహారం చెల్లించి, ఇబ్బందులను తొలగించారు. కాల్వ పనులు 95 శాతం పూర్తయ్యాయి. కానీ ఆమనగల్లు మండలం సింగంపల్లి వద్ద పరిహారం రాకపోవడంతో రైతులు పనులను గతంలో అడ్డుకున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి రైతులతో శనివారం మాట్లాడి పనులు చేపట్టారు. కేఎల్ఐ డీ-82 కింద మొత్తం 58,789 ఎకరాలకు నీరందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 28,150 ఎకరాలకు నీరందుతోంది. నాగిళ్ల వరకు కాల్వ పూర్తయితే పూర్తి స్థాయిలో నీరందనుంది.

అందని పరిహారం

కేఎల్ఐ డీ-82లో భాగంగా రూ.80 కోట్ల భూ నష్ట పరిహారం పెండింగ్‌లో ఉంది. 254 ఎకరాలకు గాను రూ.20 కోట్లకు టోకెన్‌ను రైతులకు సిద్ధం చేయగా, అకౌంట్లలో డబ్బులు జమ కావాల్సి ఉంది. కాగా, మరో 300 ఎకరాలకు సంబంధించి సుమారు రూ.60 కోట్లకు ప్రతిపాదనలు పంపినా రాలేదు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ పరిహారాన్ని మంజూరు చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.



బహిరంగ సభ స్థలం వద్ద ఏర్పాట్లపై ఐజీ, డీఐజీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వంద పడకల ఆస్పత్రి కోసం విజ్ఞప్తి

మూడు జాతీయ రహదారుల కూడలిగా ఉన్న కల్వకుర్తికి వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యా పరంగా ఇంజనీరింగ్ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేస్తారని ఆశిస్తున్నారు. అదే విధంగా ఆమనగల్లులో 50 పడకల ఆస్పత్రి నిర్మించాలని, పాలిటెక్నిక్ కళాశాల పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

తుక్కుగూడ నుంచి కల్వకుర్తి వరకు ఆరులేన్ల రోడ్డు

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు జాతీయ రహదారి మూడు లేన్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నుంచ కల్వకుర్తి వరకు ఆరు లేన్ల రోడ్డును కేంద్రంతో మాట్లడి మంజూరు చేయించాలని కోరుతున్నారు.

ఏర్పాట్లు పూర్తి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం కల్వకుర్తికి రానున్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకు ముందు పట్టణంలోని మునిసిపల్ బీఎస్ఎన్ఎల్ మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం రాక సందర్భంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. కలెక్టర్ బదావత్ సంతోష్‌తో పాటు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఫార్మాసిటీ భూముల క్షేత్రస్థాయి పరిశీలన

● టీఎస్ఐఐసీ ఎండీతో కలిసి పరిశీలించిన కలెక్టర్

యాచారం, జూలై 27 : మండలంలోని కుర్మిద్దలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను శనివారం కలెక్టర్ శశాంక, టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంత వరకు ఎన్ని ఎకరాల భూములను సేకరించారు? ఆ భూముల్లో ఎవరైన సాగు చేస్తున్నారా? వంటి తదితర వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూమిని సమగ్రంగా పరిశీలించి.. పట్టా భూములా? లేదా ప్రభుత్వ భూములా? అని అడిగి తెలుసుకున్నారు. కాగా, అధికారులు ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను పరిశీస్తున్నట్లు తెలుసుకున్న కొంతమంది రైతులు తమ భూములు తీసుకోవద్దని, ఇక్కడ ఫార్మా కంపెనీలు ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయెద్దని డిమాండ్ చేశారు. కలెక్టర్‌తో తమ గోడు వెల్లబోసుకునేందుకు వచ్చిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. భూములను నిషేధిత జాబితాలో ఉన్నవని, మా గోడును కలెక్టర్‌కు చెప్పుకుంటామని రైతులు పోలీసులను కోరినా పట్టించుకోలేదు. దాంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు అధికారుల పర్యటనను వీడియో తీయగా పోలీస్ అధికారులు సెల్‌ఫోన్లు లాక్కొని డిలీట్ చేసినట్లు రైతులు తెలిపారు. ఈ విషయమై సీఐతో మాట్లాడడానికి ఫోన్‌చేయగా తీయలేదు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

లౌకికశక్తులు ఏకం కావాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం, జూలై 27: రాజకీయాల్లో మతోన్మాదం ప్రమాదకరమని, దానికి వ్యతిరేకంగా లౌకికవాద శక్తులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కేంద్రంలో బీజేపీ పాలకులు అధికారం కోసం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని, దీనిని నిలువరించాలన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ 4వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మత స్వేచ్ఛకు సీపీఎం కట్టుబడి ఉంటుందన్నారు. ఎవరి మతం, సంప్రదాయాలను వారు గౌరవించుకుంటూ కలిసి ఉండాలనేదే తమ అభిమతమన్నారు. ప్రభుత్వంలో, అధికారిక కార్యక్రమాల్లో మతం ఉండరాదన్నారు. విద్యా రంగంలోకి మతాన్ని తీసుకురావద్దన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను సహించేది లేదన్నారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలకోసం మస్కు నర్సింహ రాజీలేని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడుతూ నర్సింహ హయాంలోనే అనేక మంది పేదలకు ఇళ్ల స్థలాలు, భూములు పంచారన్నారు. సీపీఎంను సంస్థాగతంగా బలోపేతం చేస్తూ ప్రజా పోరాటాలను ముందుకు తీసుకుపోదామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, మండల కార్యదర్శి సీ.హెచ్.జంగయ్య, పి.యాదయ్య, బి.సామేల్, బి.మధుసూదన్‌రెడ్డి, డి.జగదీశ్, కవిత, మస్కు అరుణ తదితరులు పాల్గొన్నారు.



వర్ధంతి సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



మేడ్చల్ టౌన్/మేడ్చల్ : మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు, సీపీఆర్ చేసి చూపిస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్ టౌన్, జూలై 27 : గుండె పోటుతో ఊపిరి ఆగిపోయిన వారికి పునర్జన్మ ప్రసాదించటానికి సీపీఆర్ పద్ధతి ఎంతగానో ఉపయోగ పడుతుందని, దీనిపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ, రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతిని పురస్కరించుకుని మేడ్చల్‌లోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ ప్రధాన కార్యాలయంలో శనివారం సీపీఆర్‌పై 108 సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఆర్ పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రజా జీవితంలో అకస్మాత్తుగా కొందరికి గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి సీపీఆర్‌తో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణా పాయ స్థితినుంచి బయట పడుతారన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించే 108 సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సీపీఆర్ పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం 500 మందికి సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎస్‌హెచ్ఎం డైరెక్టర్ డాక్టర్ పృథ్వీ, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశం, ఈఎంఆర్ఐ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రమణ, తెలంగాణ 108 రాష్ట్ర కార్యనిర్వాహణ అధికారి ఎంఏ ఖలీద్, మేడ్చల్, హైదరాబాద్ ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ: అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్, జూలై 27(ఆంధ్రజ్యోతి) : సీపీఆర్ మనిషికి పునర్జన్మ వంటిదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు(స్థానిక సంస్థలు) కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. నేషనల్ కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్) అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాధిక పాల్గొని మాట్లాడారు. సీపీఆర్ అవగాహన దినోత్సవం డాక్టర్ అబ్దుల్ కలాం జ్ఞాపకార్థం జూలై 27న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఆర్ ప్రాముఖ్యత, సాంకేతికలపై అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, ప్రోగ్రాం అధికారులున్నారు. కాగా, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు.

పది నెలల శిశువుకు అరుదైన వ్యాధి

● ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన తల్లిదండ్రులు
● చికిత్స కోసం స్పందించిన సీఎం కార్యాలయం

ఇబ్రహీంపట్నం, జూలై 27: అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్న పాపకు వైద్య సాయాన్ని అందిస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాప తల్లిదండ్రులకు భరోసా ఇవ్వగా ఆ వెంటనే సీఎం కార్యాలయం స్పందించింది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పొల్కంపల్లికి చెందిన పొన్నాల రాజశేఖర్-తేజశ్రీ దంపతులకు పది నెలల పాప ఆరాధ్య గాచర్ డిసీజ్(లైసోమల్ స్టోరేజ్ డిజార్డర్)తో బాధపడుతోంది. చిన్నారికి బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సుమారు రూ.20-25లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే వారికి వైద్య ఖర్చులు భరించడం స్థోమత లేక పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన శనివారం భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి విషయం వివరించారు. ఎంపీ వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సహాయ కార్యదర్శి సంగీత సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ పాపకు వైద్యం చేయించే బాధ్యత తనదని కూడా ఎంపీ భరోసా చెప్పారు. కాగా అదే సాయంత్రం సీఎంవో కార్యాలయం నుంచి పాప తండ్రి రాజశేఖర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. పూర్తి సమాచారాన్ని తెలుసుకున్న అధికారులు లక్డీకాపూల్ సీఎస్‌జే ఆసుపత్రిలో సోమవారం పాపను చేర్చాలని తెలిపారని రాజశేఖర్ చెప్పారు.



చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంపీ

ఎమ్మెల్యే చొరవతో పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్పు

బషీరాబాద్, జూలై 27: ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే బషీరాబాద్ పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా మార్పు చేసినట్లు ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీని శనివారం వారు పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆస్పత్రి స్థాయి పెంపుపై వారితో కలిసి ఆనందం పంచుకున్నారు. అక్కడున్న వైద్యుడు శ్రీకాంత్‌తో ఎంత మంది కొత్తగా స్టాఫ్ వచ్చారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ముగ్గురు వైద్యులు నియమించగా, ఒక హెడ్ నర్సు, 12 మంది స్టాఫ్ నర్సులు ఇప్పటికే విధుల్లో చేరారని వైద్యుడు వివరించారు. సీహెచ్‌సీ నూతన భవనం నిర్మాణ విషయమై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. వారివెంట ఏఎంసీ మెంబర్ అనూప్, కాంగ్రెస్ నాయకుడు రియాజ్, యువకులు పలువురు పాల్గొన్నారు.



బషీరాబాద్ సీహెచ్‌సీలో రోగితో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, అజయ్‌ప్రసాద్

నేవీరాడార్ అటవీ ప్రాంతాన్ని సందర్శించిన ఎస్పీ, అదనపు కలెక్టర్

పూడూరు, జూలై 27: మండలం మండలం దామగుండం అటవీ ప్రాంతాన్ని నేవీ, అటవీశాఖ అధికారులతో కలిసి ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వసుచంద్ర, పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిలు శనివారం సందర్శించారు. అక్కడ ఏర్పాట్లు, కార్యకలాపాలను పరిశీలించారు. కాగా, నేడు(శనివారం) జరగాల్సిన శంకుస్థాపన కార్యక్రమం నిలిచిపోయింది. దాంతో అధికారులు మళ్లీ నేవీ రాడార్ ప్రారంభోత్సవానికి కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటయ్యే కార్యాలయాలకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ చెట్లను కాపాడుకుంటూ కార్యాలయాలను నిర్మించే విధంగా స్థలాలను పరిశీలించారు. వారితో చెన్‌గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారెడ్డి, సర్వేయర్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

తెరుచుకున్న బషీరాబాద్ ఠాణా ప్రధాన ద్వారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, జూలై 27: 'బషీరాబాద్ ఠాణాకు వాస్తు దోషమట !!' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ విషయమై స్థానిక ఎస్సైని ఆరా తీసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఠాణా ప్రధాన ద్వారం తలుపులు శనివారం తెరుచుకున్నాయి. ఈ క్రమంలో బషీరాబాద్ ఎస్సై రమేష్‌కుమార్ స్పందిస్తూ పోలీస్‌స్టేషన్‌లో చిన్న, చిన్న మరమ్మతు పనులు జరుగుతుండటంతో ప్రధాన ద్వారం మూసి పక్కన ఉన్న డోర్ తెరిచామని తెలిపారు. అయితే, ప్రధాన ద్వారం ఎదుట స్థలం అంతగా లేక వాహనాలు పార్కింగ్‌తో తిరగలేని పరిస్థితి ఉందన్నారు. ఇక్కడే రిసెప్షన్ ఏర్పాటుతో కూడా రాకపోకలకు ఇబ్బందిగా ఉండటం పట్ల రెండో డోర్ ఎదుట ఖాళీ స్థలం అనుకూలంగా ఉండటంతో కొంత మార్పులు చేశామంటూ ఎస్సై చెప్పుకొచ్చారు.



తెరుచుకున్న ప్రధాన ద్వారం తలుపులు

వికారాబాద్‌లో చార్మినార్ సర్కిల్
అటవీ సంరక్షణాధికారి పర్యటన

వికారాబాద్, జూలై 27: చార్మినార్ సర్కిల్ అటవీ సంరక్షణాధికారి ఎస్.రాంబాబు శనివారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి సంబంధించిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. జిల్లాలోని మిట్టకోడూర్, జాఫర్‌పల్లిలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. తిప్పాపూర్ రిజర్వు ఫారెస్ట్‌లోని 20 హెక్టార్ల ఎస్ఎంఎం ప్లాంటేషన్, మిట్టకోడూరులోని 10 హెక్టార్ల ఎస్ఎంఎం ప్లాంటేషన్, జాఫర్‌పల్లి అర్బన్ ఫారెస్ట్ పార్కును తనిఖీ చేశారు. అనంతరం వికారాబాద్ ఫారెస్ట్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి శ్యామ్‌కుమార్, పరిగి రేంజ్ అధికారి ఎండీ అబ్దుల్‌హై, సంబంధిత సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.



మిట్టకోడూర్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అటవీ సంరక్షణాధికారి రాంబాబు

నియోజకవర్గ కేంద్రాల్లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు

● ఆగస్టులో ప్రారంభించేందుకు చర్యలు
● ముందుగా తాండూరులో ప్రారంభానికి ఏర్పాట్లు

తాండూరు, జూలై 27 : నియోజకవర్గ కేంద్రాల్లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వారంలోగా కేంద్రాలను ప్రారంభించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ఆదేశానుసారంగా వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ముందుగా అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు తాండూరు మున్సిపాలిటీ పరిధిలో సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన భవనాన్ని పరిశీలిస్తున్నారు. పాత మున్సిపాలిటీలో ప్రైవేట్ లైబ్రరీతో పాటు సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనం కోసం పరిశీలించారు. తాండూరుతో పాటు కొడంగల్, పరిగి, వికారాబాద్‌లో సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు.

యువతకు ఎంతో ప్రయోజనం

నాలెడ్జ్ సెంటర్‌లో నిపుణులతో ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తారు. యువతకు శిక్షణ అందించడంతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను కూడా సెంటర్లలో ఏర్పాటు చేయనున్నారు. వందలాది మంది నిరుద్యోగులు బీటెక్, ఎంటెక్, ఐటీఐ వంటి కోర్సులు పూర్తి చేసినా తగిన స్కిల్స్ లేక గ్రామాల్లోనే ఉండిపోతున్నారు. గ్రంథాలయాల్లో ఆధునిక శాస్త్ర, సాంకేతిక విద్యకు సంబంధించిన పుస్తకాలు లేకపోవడంతో యువకులకు వాటిని కొనుగోలు చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

తాండూరు డివిజన్‌కు రెండు సెంటర్లు

తాండూరు డివిజన్ తాండూరుతో పాటు కొడంగల్‌లో సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. వారంలోగా ఈ కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే వారంలో మంత్రుల చేతుల మీదుగా సెంటర్లను ప్రారంభించే అవకాశాలున్నాయి.

వ్యవసాయ శాఖలో బదిలీలకు బ్రేక్

● రుణమాఫీ ప్రక్రియ ముగిసిన తర్వాతే..

తాండూరు రూరల్, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని శాఖల్లో బదిలీల పరంపర కొనసాగిస్తోంది. అన్ని శాఖల్లో ఉద్యోగుల బదిలీలు ఉన్న వ్యవసాయ శాఖలో బదిలీలు మాత్రం తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రైతు రుణమాఫీకి సంబంధించి రైతుల్లో ఉన్న సందేహాలు నివృత్తిని చేసి పరిష్కరించడంలో వ్యవసాయశాఖ అధికారులు కీలంగా మారారు. ఇప్పటికే రూ.లక్ష రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ లోపు రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయనుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖలో తాత్కాలికంగా బదిలీలు నిలిపివేసినట్లు తెలుస్తోంది. తాండూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో ఏడీ, ఐదుగురు ఏవోలు, 24 మంది ఏఈవోలు ఉన్నారు. కాగా, వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఇప్పటికే వీరందరి వివరాలు సేకరించింది. పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల్లో ఇప్పటికే బదిలీలు పూర్తయ్యాయి. అయితే, రుణమాఫీ ప్రక్రియ ముగిసిన తర్వాత బదిలీలు అయ్యే అవకాశం ఉందని ఏడీఏ రుద్రమూర్తి ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు.

అంటువ్యాధులు, పరిశుభ్రతపై
జానపద గేయాలతో అవగాహన

కందుకూరు, జూలై 27: వానాకాలంలో ప్రబలే వ్యాధుపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి సాంస్కృతిక సారథి బృందం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం మండలంలోని దెబ్బడగూడలో రెండు గంటల పాటు ప్రధాన వీధుల్లో కళాకారులు జానపద గేయాలతో పరిసరాలను పరిశుభ్రతపై ప్రజలను చైతన్యం చేశారు. కళాకారులు అనిల్, ఎల్.శ్రీనివాస్, ఈశ్వర్, సంతోష్, సత్యవాణి, కరుణ, అపూర్వ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బడగూడలో జానపద గేయాలతో ప్రజలను చైతన్యపరుస్తున్న కళాకారులు

'ఉపాధి హామీ' పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య

చేవెళ్ల, జూలై 27 : ఉపాధిహామీ పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యతో కలిసి కాంతయ్య హాజరయ్యారు వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పట్ల కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఎన్నికల ముందు ప్రతీవారం ఉపాధి డబ్బులు కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం.. తర్వాత డబ్బులు జమ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్య పరుస్తూ.. తగిన నిధులు కేటాయించకపోగా పథకాన్ని ఎత్తివేసే దిశలో ఆలోచన చేస్తుందన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ రేపు తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, జంగయ్య, నర్సింహ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు శివ, నాయకులు ఆనందం, నర్సింలు, స్వరూప, కృష్ణ య్య, చంద్రయ్య, సురేశ్, గాలయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

పాఠశాలల్లో బోనాల సంబురాలు



మేడ్చల్ టౌన్: బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేడ్చల్ టౌన్, జూలై 27: మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ ఎస్‌కేఎం హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు తెలంగాణ సంప్రదాయ దుస్తులు ధరించి బోనం ఎత్తుకుని పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులు బోతరాజు వేషధారణతో విన్యాసాలను చేశారు. ఈ సందర్భంగా మహాకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లవకుమార్ గౌడ్, డైరెక్టర్ ఎస్.శృతిగౌడ్, మాజీ సర్పంచ్ కైరం కొండ గణేష్ పాల్గొన్నారు.

కీసర: ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా శనివారం పాఠశాలలో బోనాల పండుగ సంబురాలు నిర్వహించారు. మండలంలోని చీర్యాల్ గ్రామంలోని ఎస్ఆర్ పాఠశాలలో విద్యార్థినులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబెంచేలా బోనాలను అలంకరించి గ్రామదేవతలకు సమర్పించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో జానపద గేయాలకు విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం నృత్యాలు చేసి బోనాల పండుగ సందడి చేశారు.

కీసర రూరల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిబింబం బోనాల పండుగ అని నాగారం సెరినిటీ పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని పాఠశాలలో శనివారం బోనాల సంబురాలను నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో, నాట్యాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వసంత, పాఠశాల సిబ్బంది వెంకటసుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కీసర: చీర్యాల్ ఎస్ఆర్ పాఠశాలలో బోనాలను ఊరేగిస్తున్న విద్యార్థినులు



కీసర రూరల్: విద్యార్థులతో పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి

క్రైం కార్నర్

నాటుసారా తయారీ స్థావరంపై పోలీసుల దాడులు

● ఒకరిపై కేసు నమోదు

పెద్దేముల్, జూలై 27: నాటుసారా తయారీ స్థావరంపై టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తట్టెపల్లి శివారులో సారా తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు శనివారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. తట్టెపల్లి శివారు పొలాల్లో తనిఖీలు చేసి నాటుసారా తయారు చేస్తున్న స్థావరాన్ని గుర్తించారు. జాదవ్‌చందర్ అనే వ్యక్తి సారా తయారు చేస్తూ పట్టుబడ్డాడు. అతడివద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న 15లీటర్ల సారాయి, సారా తయారు చేసేందుకు ఉపయోగిస్తున్న నవసాగరంను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. రెండు బ్యారళ్లలో నిల్వచేసి ఉంచిన 150లీటర్ల బెల్లం ఊటను గుర్తించి పారబోశారు. సారా తయారు చేసేందుకు ఉపయోగించే పరికరాలను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న జాదవ్ చందర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.



తట్టెపల్లి శివారులో సారా తయారు చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

దొంగకు జైలుశిక్ష

కీసర రూరల్, జులై 27: మహిళ మెడలోంచి పుస్తెల తాడును అపహరించుకెళ్లిన దొంగను శనివారం కీసర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జల్సాలకు అలవాటు పడిన కోత్రోజు సందీప్ చారి(25) దొంగతనాల బాట పట్టాడు. ఈ క్రమంలో నాగారం మున్సిపాలిటీ వెంకటేశ్వర నగర్ కాలనీలో నివాసముండే స్వరూప మెడికల్ షాప్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా వెనకాల నుంచి వచ్చిన సందీప్‌చారి ఆమె మెడలోంచి బంగారు పుస్తెల తాడును అపహరించుకుని సిద్ధంగా ఉంచుకున్న తన నంబర్‌లేని బైక్‌పైన పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న సందీప్‌చారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా నాగారంలో జరిగిన చైన్‌స్నాచింగ్‌తో పాటు మరో రెండు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. చోరీ చేసిన వస్తువులను తాకట్టు పెట్టినట్లు చెప్పాడు. అంతేగాక 2021లో జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు చైన్‌స్నాచింగ్ కేసుల్లో పట్టుబడి, జైలు శిక్షను అనుభవించి విడుదలై వచ్చాడు. ఈ మేరకు అతన్ని న్యాయస్థానం ముందు హాజరు పరిచినట్లు వివరించారు.

అబ్దుల్‌కలాం ఆశయ సాధనకు కృషి చేయాలి



ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 27: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషిచేయాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అవుషాపూర్‌లోని అబ్దుల్ కలాం పార్కులో శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, సదానంద్‌రెడ్డి, మశ్చేందర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, సందీప్ పాల్గొన్నారు.

కులకచర్ల: చౌడాపూర్ మండల కేంద్రంలో అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, గ్రామకమిటీ అధ్యక్షుడు సేవ్య యాదయ్య పాల్గొన్నారు.

తాండూరు: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, ఉపాధ్యక్షుడు దోమ కృష్ణ, ప్రకాష్, కార్యదర్శి చందు, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, పాల్గొన్నారు.

స్టార్టప్ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి



సీఎంఆర్‌ఐటీ గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే

మేడ్చల్ టౌన్, జూలై 27: సాంకేతిక రంగంలోని విద్యార్థులు ఉద్యోగాలకు పరిమితం కాకుండా స్టార్ట్ అప్ కంపెనీల ఏర్పాటుకు కృషి చేయాలని మల్లారెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపకులు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సీఎంఆర్‌ఐటీలో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొని విద్యార్థులను ద్దేశించి మాట్లాడారు. ప్రపంచంలోని ప్రఖ్యాత వ్యాపార సంస్థల్లో భారత దేశ మూలాలకు చెందిన వారు ఉన్నత పదవుల్లో పనిచేస్తూ ప్రపంచానికి సేవలందిస్తున్నారన్నారు. పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులు ఇంతటితో చదువులను ఆపకుండా ఉన్నత చదువులు చదివి గొప్పస్థాయికి ఎదగాలన్నారు. నేటి సాంకేతిక యుగంలో టెక్నాలజీ కీలకంగా మారిందన్నారు. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు కొత్త విషయాలను కనుగొని వాటిపై అధ్యయనం చేయాలని సూచించారు. కళాశాలలో చదివిన విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్లు దొరకడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టీఐ మైండ్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ సీతారాం వేలరి, శ్రీలంక మొరటువ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుబోధ చార్లెస్, సీఎంఆర్ గ్రూప్ కార్యదర్శి డాక్టర్ గోపాల్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, సీఈవో అభినవ్‌రెడ్డి, సీఎంఆర్ ఐటీ డైరెక్టర్ ఎం.జంగారెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూధనరావు పాల్గొన్నారు.

గుంతలరోడ్డుపై హోటల్ సూచిక బోర్డు

పూడూరు, జూలై 27: వికారాబాద్-హైదరాబాద్ వెళ్లే రహదారి నడి రోడ్డులో మన్నెగూడ చౌరస్తాలో ఉన్న రాజ్ హోటల్ సూచిక బోర్డును పెట్టడంతో వచ్చే వాహన దారులు, ప్రజలు చూసి ఆశ్చర్యపోతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు గుంతలు పడింది. దీంతో ఆ హోటల్ యజమాని తాను ఏర్పాటు చేయించుకున్న హోటల్ సూచిక బోర్డును గుంతలు పడిన రోడ్డుపై ఉంచి వాహనదారులకు ఇక్కడ గుంత ఉన్నట్లు తెలిసేలా చేశాడు. హోటల్ యజమానికి వచ్చిన ఆలోచన పంచాయతీ అధికారులు, సిబ్బందికి, రోడ్డు పరిశీలించే అధికారులకు లేకుండా పోయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



గుంతలరోడ్డుపై ఏర్పాటు చేసిన హోటల్ సూచిక బోర్డు

మృతి చెందిన వారికి రుణమాఫీ వర్తించదా..?

మోమిన్‌పేట్, జూలై 27: మండలంలోని చక్రంపల్లికి చెందిన బోయ కిష్టయ్య ఎన్కతలలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 2018లో క్రాప్ లోన్ కింద రూ.లక్ష తీసుకున్నాడు. ఈ క్రమంలో కిష్టయ్య 29.1.2021న అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే బ్యాంకు మేనేజర్ తీసుక్ను రుణంతో పాటు వడ్డీ మొత్తం చెల్లించాని నోటీసు పంపించారని కిష్టయ్య కుటుంబసభ్యులు వాపోయారు. ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీలో తమకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు కోరారు.

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి

కొడంగల్, జూలై 27: ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించు కోవాలని రంగారెడ్డి జిల్లా ఆర్టీసీ ఏటీఎంసీ రవీందర్ సూచించారు. కొడంగల్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం కార్గో కొరియర్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ సేవలను మరింత విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. వస్తువులను ఇతర ప్రాంతాలకు సురక్షితంగా చేరవేసేందుకు కార్గో సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది భానుప్రసాద్, చంద్రయ్య, వసంత్, విశ్వనాథ్ గౌడ్, కార్గో ఏజెంట్ నరేశ్‌కుమార్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో కార్గో సెంటర్‌ను తనిఖీ చేసిన ఆర్టీసీ అధికారులు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు, బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న గ్రామస్థులు

తాండూరు రూరల్, జూలై 27: మండలంలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ పెద్దేముల్ మండలం నర్సాపూర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాతలలో విజయ్‌కుమార్‌కు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. విజయ్‌కుమార్ గత 14ఏళ్లపాటు దస్తగిరిపేట్ ప్రాథమిక పాఠశాలలో పనిచేశారని, ఆయన సేవలు మరువలేనివని మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్, శాంతు, రాములు, వడ్డె శేఖర్, కరీం, శ్రీనివాస్, నర్సింహులు ఉన్నారు. అంతకుముందు ధారూర్ మండలం గడ్డమీది గంగారం పాఠశాల నుంచి వచ్చిన నూతన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని సన్మానించారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ధారూరు, జూలై 27: బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ధారూరు పోలీస్ సర్కిల్ సీఐ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శనివారం సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలకార్మికులు, బాల్యవివాహాల నివారణ, బాలల అక్రమ రవాణా నిర్మూలనపై బాలల సంరక్షణ కమిటీ సభ్యులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ చీఫ్ అడ్వకేట్ వెంకటేశం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సభ్యుడు అలీమోద్దీన్, చైల్డ్‌లైన్ సభ్యురాలు మౌనిక, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, బాలల సంరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

కోట్‌పల్లి తహసీల్దార్‌గా మహేష్ బాధ్యతల స్వీకరణ

బంట్వారం (కోట్‌పల్లి), జూలై 27: కోట్‌పల్లి మండల నూతన తహసీల్దార్‌గా మహేష్ కుమార్ శనివారం తహసీల్దార్ కార్యలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పెద్దేముల్ మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలు రెవెన్యూపరంగా ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటానని, అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా తహసీల్దార్ల బదిలీలు చేపట్టడంతో కోట్‌పల్లి మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఆశాజ్యోతి బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్ మహేష్‌ను కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, నాయకులు బందెయ్య, రాంరెడ్డి, దినేష్, రమేష్, వెంకటయ్య తదితరులు సన్మానించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మహేష్

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

వికారాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పేదల భూములను ఆక్రమించుకుని బెదిరింపులకు పాల్పడుతున్న భూకబ్జాదారు ఉమర్‌ఖాన్, అతడి గ్యాంగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని పూడూరు మండలానికి చెందిన పలువురు బాధిత రైతులు ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి బాధిత రైతులు తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డితో వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పెద్దల అండదండలు లేని పేద రైతుల భూములను ఆక్రమించుకుని వాటికి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో ఆడిందే ఆట పాడిందే పాటగా ఉమర్‌ఖాన్, అతడి అనుచరులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ భూమిని విక్రయించాలని భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. వారిపై పదుల సంఖ్యలో ఎఫ్ఐఆర్‌లు నమోదైనా వారిపైన పోలీసు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పూడూరు మండలం, చెన్‌గోముల్‌కు చెందిన నరేష్‌కుమార్‌తో పాటు పలువురు బాధిత రైతులు చిన్నారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. చెన్‌గోముల్ గ్రామంలో సర్వే నెంబర్ 253లో తన మేనకోడలితో పాటు తమ బంధువు పేరిట ఐదున్నర ఎకరాల వ్యవసాయ భూమిని అమ్మాలని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ఉమర్‌ఖాన్‌కు అనుకూలంగా పంచనామాలు నిర్వహించడమే కాకుండా ఫోర్జరీ డాక్యుమెంట్ల ఆధారంగా పట్టా పాస్‌పుస్తకాలూ జారీ చేస్తున్నారన్నారు. చెన్‌గోముల్‌కు చెందిన ఇద్దరు పేదరైతులకు సంబంధించిన భూమిని పూడూరు తహసీల్దార్ కార్యాలయం అధికారుల సహకారంతో ఉమర్ ఖాన్ తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. బాధిత రైతులు శనివారం ఎస్పీ నారాయణరెడ్డిని కలవగా న్యాయం చేస్తామని బాధిత రైతులకు ఎస్పీ హామీ ఇచ్చారు.

శిశుమందిర్‌లో గోరింటాకు వేడుక



పరిగి, జూలై 27: పరిగిలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శనివారం గోరింటాకు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు గోరింటాకు పండుగలో పల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మల్లేశ్ మాట్లాడుతూ.. ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల లభించే ఉపయోగాలను వివరించారు. రోగనిరోధకశక్తి పెంచి,రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుందన్నారు. అందుకే ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం అనవాయితీగా వస్తుందన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 27: 18 నుంచి 59 సంవత్సరాల్లోపు గల రైతులు ఆగస్టు 4వ తేదీ లోపు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.ఎ బాసిత్ కోరారు. కొత్తగా పట్టదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు, గతంలో రైతుబీమా చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతుభీమా దరఖాస్తుఫారం, పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డ్, నామిని ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లతో సంబంధిత ఏఈవోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుబీమాలో తప్పుల సవరణకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. గతంలో రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవద్దని సూచించారు.

చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న శుభప్రద్ పటేల్

వికారాబాద్, జూలై 27: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు. ఆయన జన్మదిన సందర్భంగా శనివారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి, డీడీడీఎఫ్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు అప్ప విజయ్ కుమార్, కౌన్సిలర్ సురేష్ గౌడ్, నాయకులు కేదార్, ప్రేమ్, శాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ తన జన్మదిన వేడుకలను శనివారం విద్యార్థుల మధ్యన జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. రసూల్‌పూర్ హనుమాన్, భద్రేశ్వర ఆలయాలలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అభిమానులు, ఆత్మీయుల మధ్య కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ ట్రస్ట్ సభ్యులు భానుప్రసాద్, విజయ్, నరేష్, హరీష్, నాయకులు అబీద్, శివకుమార్, లక్ష్మణ్‌చారీ, అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **మేడ్చల్ టౌన్:** మున్సిపాలిటీ వార్డుల్లోని వీధుల్లో వీధి కుక్కల నుంచి రక్షించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు శనివారం చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

● **తాండూరు రూరల్:** మల్కాపూర్ గ్రామంలో 11 సంవత్సరాలుగా పశువైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ నిజానంద్ పూడూరు మండలం కంకల్ పశువైద్య కేంద్రానికి బదిలీ అయ్యారు. అదేవిధంగా చెంగోల్ గ్రామ పశువైద్యాధికారిగా ఐదు సంవత్సరాల పాటు అదనపు వైద్యాధికారిగా పనిచేశారు.

● **దోమ:** మోత్కూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన ఎడ్ల అంజిలమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ స్పందించి శనివారం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, చెన్నయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాధ్యాయులు వడ్ల గోపాల్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన ఆవడ్ల గోపాల్ ఇక ముందు సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, యూటీఎఫ్ నాయకులు గౌరారం గోపాల్, మల్లేశ్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

● **పరిగి:** ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి శనివారం పరిగిలో మైనార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఓవైసీ హైదరాబాద్ నుంచి పరిగి మీదుగా కొడంగల్ వైపు వెళుతుండగా పరిగిలోని చాయ్‌విల్లా దగ్గర స్వాగతం పలికారు. పరిగి మైనార్టీ నాయకులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

● **కొడంగల్:** ఈ నెల 28న కొడంగల్‌లో నిర్వహించే పెద్దమ్మ తల్లి రథోత్సవాన్నిజయప్రదం చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డిని ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. కొడంగల్‌లోని తెలంగ్‌వాడీ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

● **కొడంగల్:** పట్టణ శివారులోని సిద్ధనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలిసా పారాయణం ఘనంగా నిర్వహించారు. శనివారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఇప్పటికి 44 వారాల పాటు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

● **కొడంగల్:** శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రుద్రారంలో శనివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. హైదరాబాద్ యంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, శైలజ, నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు ప్రసాద్ ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

● **బషీరాబాద్:** ప్రతీఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని బషీరాబాద్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ సూచించారు. శనివారం మండలంలోని అల్లాపూర్‌లో వన మహోత్సవంలో భాగంగా ఆయన మొక్కలను నాటారు.

● **తాండూరు:** శిక్ష సప్త కార్యక్రమంలో భాగంగా శనివారం 20వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో కౌన్సిలర్ సంగీత ఠాకూర్ మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు మాధవి, సరిత, జగదీశ్వరి పాల్గొన్నారు.

● **తాండూరు:** శంత్ మహాల్ చౌరస్తాలో కొలువుదీరిన కాళికాదేవి ఆషాఢ మాస జాతర ఉత్సవాలకు ముస్తాబైయింది. రెండు రోజుల పాటు ఈ జాతర ఉత్సవాలు జరుగుతాయి. ఈ నెల 28న ఆదివారం (నేడు) 29వ తేది సోమవారం జాతర మహోత్సవాలు జరుగుతాయని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా ఆదర్శ నగర్‌లో కొలువైన కట్ట మైసమ్మకు ఆదివారం (నేడు) బోనాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకులు, నిర్వాహకులు తెలిపారు.

● **తాండూరు:** తాండూరు పట్టణంలో గుంతలు పడ్డ రోడ్లను యుద్ధ ప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టాలని, గల్లీలలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డికి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు.

తాండూరు: వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డిని ఆర్పీఎల్ సీఈవో, కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

● **పూడూరు:** కెరెళ్లి గ్రామానికి చెందిన ఎండీ ఆలీ తన సొంత నిధులతో శనివారం పిచ్చిమొక్కలకు స్ప్రే చేయించారు.

● **కులకచర్ల:** అమ్మపై ప్రేమతో ప్రతీ విద్యార్థి మొక్కలు నాటి సంరక్షించాలని స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ దేవి తెలిపారు. పాఠశాలలో శనివారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దండ శ్రీకాంత్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్ శనివారం దండు శ్రీకాంత్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

బంట్వారం (కోట్‌పల్లి), జూలై 27: కోట్‌పల్లి తాండూరు ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతలనుకోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన చందనగిరి సేవాదళ్ సభ్యులు శనివారం పూడ్చివేశారు. గ్రీన్‌రోడ్ చాలెంజ్‌లో భాగంగా కోట్‌పల్లి తాండూరు రోడ్డుపై గుంతలు పడడంతో చిన్న చిన్న వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురౌతున్నారని దీంతో గుంతలను పూడ్చివేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావిరాల రవి, అశోక్, రాజు పాల్గొన్నారు.



గుంతలను పూడ్చివేస్తున్న చందనగిరి సేవాదళ్ సభ్యులు

నోటీసులు ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారు?

పరిగి, జూలై 27: నోటీసులు ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని లక్ష్మీదేవిపల్లి గ్రామ రైతులు శనివారం పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావును కలిసి ప్రశ్నించారు. సర్వేనంబర్ 157లో సరిహద్దుల్లో తామంతా ఉన్నామని, తమకు తెలియకుండా సర్వే చేయడం మంచిదికాదన్నారు. సర్వే చేసిన వివరాలు ఇవ్వాలని, లేనిచో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.గోప్యంగా సర్వే చేసిన నివేదికలోని వివరాలను తమకు ఇవ్వాలని రైతులంతా కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

మర్పల్లి, జూలై 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలో బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మహిళా కార్యదర్శి మహేశ్వరి, నాయకులు రాజేశ్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, లక్ష్మన్‌నాయక్, మధుకర్, రమేశ్, సుభాష్, అన్నపూర్ణ, శ్రీధర్‌రెడ్డి, యాదవరెడ్డి, రఘుపతిరెడ్డి, నరేశ్, మహిపాల్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను ఖర్చు చేయాలి

వికారాబాద్, జూలై 27: సంక్షేమ రంగాల ప్రాధాన్యతను గుర్తించి కేటాయించిన రాష్ట్ర బడ్జెట్ కేటాయింపునకే పరిమితం కాకుండా ఆ నిధులను ఖర్చుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వారి కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామన్నారు. పదేళ్లలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సత్యనారాయణ, అక్బర్, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పొందని రైతుల వివరాలివ్వాలి

పరిగి, జూలై 27: రుణమాఫీ జాబితాలో పేర్లు రాని రైతులు వ్యవసాయ కార్యాలయాల్లో వివరాలు అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. మండలంలోని నస్కల్ గ్రామంలో శనివారం ఆయన రైతులతో మాట్లాడి రుణమాఫీ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్షలోపు రుణాలన్ని మాఫీ జరిగిందని తెలిపారు. పొరపాట్లనో, ఇతర కారణాల వల్లనో రాకపోతే వారి పేర్లు ఇస్తే ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రెడ్డి, ఎం.రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ శ్రేణులు

పరిగి, జూలై 27: కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జ్యోషిని శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో బీజేపీ పరిగి ఇన్‌చార్జి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మారుతికిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించారు.



కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషితో మారుతికిరణ్